క్లుప్తంగా

13 నుంచి వినికిడి లోపం ఉన్న వారికి పరీక్షలు

మూసాపేట: వినికిడి లోపం కలిగిన వారికి హియర్ 'ఎన్'సే క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 13 నుంచి 19వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూకట్‌పల్లిలోని హియర్ 'ఎన్'సే క్లినిక్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వినికిడి, మాట్లాడడం, భాషా లోపాలు ఉన్నవారి కోసం ఒక ప్రత్యేక బృందం హియర్ 'ఎన్'సే క్లీనిక్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వినికిడి లోపంతో పాటు బాల్య వికాస రుగ్మతలున్న వారిక కోసం వారం రోజుల పాటు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్‌థెరపీ, బిహేవియరల్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, కాక్లియర్ ఇంప్లాంట్స్, హియరింగ్ ఎయిడ్స్ కోసం ఉచిత కన్సల్టేషన్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.91218 67946.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ కిందికుంట పార్కు పాదాచారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్భవ ఆసుపత్రి వారి సౌజన్యంతో బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు 45 నిమిషాలు తప్పనిసరిగా విధిగా వాకింగ్ చేయాలన్నారు. అక్కడికి విచ్చేసిన పాదాచారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆర్‌కేవై టీం సభ్యులను అభినందించారు. రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేష్, కృష్ణారెడ్డి, నవీన్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, సీతారామరాజు, డాన్సర్ కృష్ణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కబీర్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తా

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం స్థానిక కమిటీ హాలులో జరిగాయి. ఇద్దరు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ చేయగా సమీప అభ్యర్థి పి. శ్రీనివాస్‌గౌడ్‌పై కె. జోసెఫ్ గెలుపొందారని ఎన్నికల అధికారి సంఘం సురేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కె. జోసెఫ్ మాట్లాడుతూ.. తాను గతంలో చేసిన అభివృద్ధి తన విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కబీర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన కబీర్‌నగర్‌వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాలానగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం



దాసరిబస్తీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని దాసరిబస్తీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, పలు అభివృద్ధి పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాసరిబస్తీ, బుడగ జంగం బస్తీల్లో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు, మంచినీటి పైపులైన్‌తో పాటు సీసీరోడ్డు వేసినందుకు కాలనీవాసులు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులతో మాధవరం కాంతారావు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు విచ్చేసి రాష్ట్ర పార్టీ నిర్దేశించిన శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ ఎలా నిర్వహించాలో వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు బూరుగుపల్లి రామ్మోహన్, జిల్లా నాయకులు రఘు, హరి, యాదగిరి, రమేష్, భనేష్, తులసి, రాకేష్, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న థీమ్ పార్కు



కేపీహెచ్‌బీ 15వ ఫేజులోని థీమ్ పార్కు గెరిల్లా ప్రవేశ ద్వారం



థీమ్ పార్కులో జంతువుల బొమ్మలతో ఆకర్షణీయమైన దృశ్యాలు



చిన్నారులకు జారుడు బల్ల





అంధకారంలో థీమ్ పార్కు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ 15వ ఫేజులోని సరికొత్త థీమ్ పార్కు చిన్నారులు, స్థానికులను ఆకట్టుకుంటోంది. చిన్నారుల కోసమే ప్రత్యేకంగా రూపొందించిన పార్కు చిన్నారులను అలరిస్తోంది. చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తే ఇంకా బాగుంటుంది అని చిన్నారుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

- నగరంలోనే ప్రత్యేకంగా రూపొందించిన చిన్నారుల పార్కు ది జంగిల్ పార్కు ముఖ ద్వారామే గుహ మాదిరిగా డిజైన్ చేసి గుహపై గొరిల్లా ఎక్కుతున్నట్లుగా ఉంటుంది.
- పార్కు నిండుగా పచ్చని చెట్లు... ఉయ్యాలలు, పార్కు మధ్యలో ప్రత్యేకంగా చిన్నారులకే డిజైన్ చేసిన జారుడు బల్ల ఎంతో ఆకట్టుకుంటోంది. ఇంకా సెల్ఫీ స్పాట్, సింహం, ఎలుగుబంటి బొమ్మలతో పాటు పాముల ఆకృతులు చిన్నారులనుమంత్ర ముగ్ధులను చేస్తున్నాయి.

బల్లలు కూడా కట్టెపై కూర్చొని ఉన్న విధంగా తయారు చేశారు. సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ పార్కు మాదిరి, ప్రతి డివిజన్‌లో ఒక్కటైనా నిర్మించాలని కోరుతున్నారు. వాకర్స్ వాకింగ్ చేసుకోవడానికి కూడా ఇబ్బంది లేకుండా ఉంది.

సమస్యలు...

- పార్కు ముందు సందర్శకుల కోసం పార్కింగ్ స్థలం కేటాయిస్తే బాగుంటుంది. పార్కింగ్ లేకపోవడంతో పార్కుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం సమయంలో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో పార్కింగ్‌కు ఇబ్బదులు పడుతున్నారు.
- పార్కు సమయపాలన లేకపోవడం, పార్కు ఏ సమయంలో తీస్తున్నారు. ఏ సమయంలో మూస్తున్నారో అర్థం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కు సమయాలు అక్కడ బోర్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.
- పార్కులో ఏదో కొద్ది ప్రాంతంలో పచ్చదనం గ్రాస్ ఏర్పాటు చేయాలని చిన్నారులు ఆడుకోవడానికి బాగుంటుందని కోరుతున్నారు.
- పార్కులోని పిచ్చి మొక్కలు తొలగించి అక్కడే పెద్ద కుప్పగా ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.
- పార్కులో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. సాయంత్రం 6 తరువాత పార్కులో ఉండాలన్నా భయంగా ఉంది. వాకర్స్ కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

"పార్కు చాలా బాగుంది



నా మనువడితో నిత్యం సాయంత్రం వేళ పార్కుకు వస్తున్నాం. పార్కులో గ్రీనరీ పెంచితే ఇంకా బాగుంటుంది. పార్కు చాలా బాగుంది. లైట్ల సమస్య ఉంది.

– రుక్మిణి, స్థానికురాలు

సనాతన ధర్మాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే



దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ నాలుగవ ఫేజులో శ్రీ వర సిద్ధి వినాయక భ్రమరాంబ మల్లికార్జున దేవాలయంలో దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. కొత్తగా దేవాలయాలను నిర్మించుకొని సనాతన ధర్మాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మనిషిలో ఆధ్యాత్మిక శక్తి పెరిగితే ఈ ప్రపంచమే శాంతి అవుతుందన్నారు. అందుకే దేవాలయాలను మన పూర్వీకులు నిర్మించి ఊరికి మంచి జరిగేటట్లు చేసేవారని పేర్కొన్నారు. ఇందులో సైన్స్‌తో పాటు ఆధ్యాత్మికత కూడా ఉంటుందని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ...

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 38 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదలకు సహాయం అందాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడవలసి ఉండేదన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండాముఖ్యమంత్రి కేసీఆర్ ఆపదలో ఉన్న ఎవరికైనా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారని తెలిపారు.

ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిని సందర్శించిన ఐఎంఏ బృందం



బాచుపల్లిలోని ఆస్పత్రిని సందర్శిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బృందం

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిని ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎంఏ సభ్యులకు ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు వారికి ఆస్పత్రిలో ఉన్న వివిధ విభాగాలు, అందిస్తున్న అత్యాధునిక చికిత్స విధానాలను వివరించారు. ఐఎంఏ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, కార్యదర్శి డాక్టర్ జె.విజయ్‌రావు, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ రాజేంద్రకుమార్ యాదవ్, ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ పి.కాళీప్రసాదరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ గట్టు శ్రీనివాసులు, డాక్టర్ సీహెచ్. జగన్మోహన రావు, డాక్టర్ ఏసీహెచ్.పుల్లారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు డాక్టర్ ఎ.యశోవంత్‌రావు, డాక్టర్ హరి సంధ్యారాణి, డాక్టర్ మహ్మద్ అలీమ్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ వి.జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, డాక్టర్ ఆనంద్ భోక్రే తదితరులు ఉన్నారు.

సంత్ రవిదాస్ మహారాజ్ బోధనలు అనుసరణీయం



సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీవనం వద్ద బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు రవీంద్ర రావు, నరేందర్‌రెడ్డిలతో కలిసి రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ భక్తిమార్గం ద్వారా కులవివక్ష లేని సమాజాన్ని అందించారన్నారు. రవిదాస్ బతికి ఉన్నంత కాలం చర్మకార వృత్తిని కొనసాగించి స్వయంకృషితో ఎదిగారన్నారు. గురుముఖి పంజాబీ భాషను 35 అక్షరాలలో రాసిన గొప్ప భాషా సృష్టికర్త రవిదాస్ అని కొనియాడారు. సంత్ రవిదాస్ మహారాజు బోధనలు మనం మనసా వాచా కర్మేణా ఆచరించినప్పుడే వారి ఆశయ సమాజాన్ని సాధించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజు, వినోద్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో మూడవ అంతస్తులో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆదివారం రెడ్డి సంక్షేమం సంఘం చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఐకమత్యంతో మెలుగుతూ సంఘం తరపున రెడ్డి సంఘం భవనం నిర్మించి అందరికి ఆదర్శంగా నిలవడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామిరెడ్డి, దేవేందర్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

నిజాంపేట్: ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో రికార్డు నెలకొల్పిన రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడకు చెందిన పుల్లారెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సత్కరించారు. గచ్చిబౌలిలో శనివారం జరిగిన 5వ ఆల్ ఇండియా మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో 50–54 సంవత్సరాల విభాగాల పుల్లారెడ్డి మూడు బంగారు పతకాలు సాధించి రికార్డు సొంతం చేసుకున్నారు. ఆదివారం నిజాంపేట్‌లోని తన కార్యాలయంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆయన్ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి

మూసాపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఆదివారం మూసాపేట గూడ్స్ షెడ్‌రోడ్డులో పాతపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై రమాబాయి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, కర్క డాకయ్య, కర్ర రవీందర్ అక్బర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తూము శ్రావణ్‌కుమార్

ప్రివెంటివ్ మెడిసిన్ ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఓమ్ని ఆసుపత్రిలో ఆదివారం సీనియర్ సినీ నటుడు సుమన్ ట్విలైట్ లాంజ్ ద్వారా ప్రివెంటివ్ మెడిసిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రోగం అయినా తుది దశలో గుర్తించినట్లయితే దాని నివారణ మరింత సఫలీకృతం అవుతుందన్నారు. 40 ఏళ్లు నిండిని ప్రతి ఒక్కరూ 6 నెలలకి ఒక్కసారి ప్రివెంటివ్ హెల్త్ చెకప్ చేయించుకోవటం చాలా అవసరమన్నారు. నయం చేయడం కంటే నివారణే మేలు అనేది అందరూ గమనించాలన్నారు. ఈ కోణంలో ఓమ్ని హాస్పటల్ వారు ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌లు కోసం ఒక స్పెషల్ లాంజ్‌ని క్రియేట్ చేయటం గమనార్హం. ఈ సందర్భంగా మీడియా జర్నలిస్టులకు ఓమ్ని హాస్పటల్ హెల్త్ చెకప్ కూపన్‌లు స్వాస్థ్ కార్డు ద్వారా అందించారు. ఈ స్వాస్థ్ కార్డు ద్వారా 2 లక్షల 50 వేల వరకు యాక్సిడెంట్ బెనిఫిట్స్, 40 వేల వరకు రీయింబర్సుమెంట్ సౌకర్యం, క్యాష్ బ్యాక్ సౌకర్యం వంటి బెనిఫిట్స్ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి గ్రూప్ సీఓఓలు డాక్టర్ నగేష్, డా. హరీస్ గిగిల్స్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓమ్ని ఆసుపత్రిలో ప్రివెంటివ్ మెడిసిన్‌ను ప్రారంభిస్తున్న హీరో సుమన్, తదితరులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడు నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ సంజీవని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనులపండుగగా జరిగింది. ధ్వజస్తంభం, నవగ్రహ ప్రతిష్ఠ, దేదీప్యమానంగా నిర్వహించారు. స్వామివారికి గణపతి హోమం, సింధూరం పూజలు, వడమాల, లక్ష ఆకు పూజలు, శ్రీరామ కోటి, భజనలో కోలాటాలు నృత్యాలతో పాపారాయుడు నగర్ పరిసర ప్రాంతాల్లో జై శ్రీరామ్ నామస్మరణతో ఆధ్యాత్మికతతో పరవశించింది.

- భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకొని ఆయన కృపకు పాత్రులయ్యారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రెసిడెంట్ వెంకట్రావు, నర్సింగరావు, కిరణ్ రావు,ప్రభాకర్‌రావు, భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌రావు, అరుణ్‌రావు, విష్ణువర్ధన్ రావు, భాస్కర్‌రావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తి శివునూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారులో ఉన్న హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన శ్రీకాంత్, నరేందర్, మధు, రమేష్, డ్రైవర్ శ్రీనివాస్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మెగా కిడ్స్ వార్షికోత్సవం

మోతీనగర్: గాయత్రినగర్‌లోని ఆంధ్రాబ్యాంక్ వీధిలోని మెగా కిడ్స్ స్కూల్ 12వ వార్షికోత్సవంలో ఆదివారం కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొన్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ని తిలకించి విద్యార్థులను ప్రోత్సహించారు.పాఠశాల చైర్మన్ రఘువీరనాథ్, ప్రిన్సిపాల్ సుచిత్ర భాయ్‌పాటిల్‌లు కార్పొరేటర్ సబిహా బేగంకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు పార్వతమ్మ, రవీందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లికార్జున్, సంజయ్‌రెడ్డి, యోగిరాజు, సజ్మా తదితరులు పాల్గొన్నారు.

జీవితం మీద విరక్తి చెంది మహిళ ఆత్మహత్య



సుగుణ సుశీల (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: జీవితం మీద విరక్తి చెంది ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషీగూడ మహంకాళినగర్‌లో నివాసం ఉంటున్న సుగుణ సుశీల (38) గతంలో తన కుమార్తె ఆత్మహత్య చేసుకొని చనిపోయిన సంఘటనను గుర్తు చేసుకుంటూ మానసికంగా బాధపడేది. అయితే అదే విషయాన్ని మనస్సులో పెట్టుకొని శనివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు ఎవరూ కారణం కాదని.. 'అన్నయ్య లేకుండా నేను ఉండలేకపోతున్నానని అన్నయ్యను ఏమీ అనవద్దంటూ, అన్నయ్యా నీ ఋణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేను.. నన్ను క్షమించు!!' అని సూసైడ్ నోట్‌లో రాసి ఆత్మహత్యకు పాల్పండింది. కూతురు చనిపోయిందనే మానసిక వ్యథతోనే తన భార్య చనిపోయిందని భర్త సూర్యప్రకాష్ కుమార్ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లిని అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



దీనబంధుకాలనీ, హనుమాన్‌నగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, ఎన్‌టీఆర్‌నగర్, దత్తాత్రేయకాలనీ, ఇంద్రాహిల్స్, హెచ్‌ఎంటి శాతవాహననగర్ కాలనీలో 2 కోట్ల 50 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మాదాపూర్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు జిల్ల గణేష్, నాయకులు చంద్రకాంత్‌రావు, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం...

ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బాలానగర్ ఏసీపీ గంగారాం, సీఐ సైదులు, ఎస్సై శ్రీకాంత్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి కాలనీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీవాసులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇతర బస్తీ, కాలనీ వాసులకు ఆదర్శంగా నిలిపారని కొనియాడారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, బాలానగర్ ఏసీపీగంగారాం

- అవసరమైతే అదనపు కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి తన వంతు ఆర్థిక సహాయం చేస్తానని తెలిపారు. బస్తీలో భద్రత, ప్రజల రక్షణే ధ్యేయంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అదే విధంగా సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ లలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఆహ్లాదకరమైన, ప్రశాంతకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధుకాలనీ, హనుమాన్‌నగర్ కాలనీలో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, కూకట్‌పల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివేకానందనగర్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు